క్లుప్తంగా

కాంగ్రెస్‌కు ఓటు వేయండి



కరీంనగర్ కార్పొరేషన్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని ఆ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.తాజ్ కోరారు. నగరంలోని 54వ డివిజన్ కశ్మీర్‌గడ్డ రైతుబజార్‌లో బుధవారం ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి, ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందన్నారు. కేంద్రంలోనూ వస్తే మైనార్టీల అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు మహమ్మద్ ఖలీమ్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ కరీం, రాజీ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మహిళా మోర్చా ఇంటింటి ప్రచారం



కరీంనగర్‌టౌన్: కరీంనగర్ పట్టణంలోని కోతిరాంపూర్‌లో బుధవారం బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు సుజాతరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత ఐదేళ్లలో ఎంపీ బండి సంజయ్ రూ.వేల కోట్లతో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలతో నిరుపేదలను ఆదుకుంటోందని, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి, గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పద్మజా రెడ్డి, లక్ష్మి, వనజ తదితరులు పాల్గొన్నారు.

'ట్రినిటి'లో సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం



కరీంనగర్: ట్రినిటి జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థి, సివిల్స్ ర్యాంకర్ నందాల సాయికిరణ్‌ను కరీంనగర్‌లోని ఆయన చదివిన కళాశాలలో బుధవారం సన్మానించారు. విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సాయికిరణ్‌కు తమ కళాశాలలో 2012–2014 వరకు ఉచిత హాస్టల్‌తోపాటు విద్యనందించామని తెలిపారు. ఎలాంటి కోచింగ్ లేకుండా రెండో ప్రయత్నంలోనే సివిల్స్ 27వ ర్యాంకు సాధించడం ఆయన స్వగ్రామం వెలిచాలకు, ట్రినిటీ విద్యాసంస్థలకు గర్వకారణమని పేర్కొన్నారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కోర్సులను వినియోగించుకోవాలి




కరీంనగర్ సిటీ: ఉపాధి కోర్సులను వినియోగించుకోవాలని శాతవాహన వర్సిటీ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ జయంతి అన్నారు. కరీంనగర్ ఎస్సారార్ కళాశాలలో బుధవారం బేసిక్ బ్యూటీషన్ కోర్సు పూర్తి చేసినవారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ.. పదేళ్లుగా నిర్వహిస్తున్న ఈ కోర్సు ఎంతో మందికి ఉపాధి కల్పించిందని తెలిపారు. కోర్సు కో–ఆర్డినేటర్ శోభారాణి, రిసోర్స్ పర్సన్ లీనా, లెక్చరర్లు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయించాలి



సప్తగిరికాలనీ: 60 ఏళ్లు దాటిన, అనారోగ్య సమస్యలున్న, చంటి పిల్లలున్న ఉద్యోగ, ఉపాధ్యాయులను ఎంపీ ఎన్నికల విధుల నుంచి మినహాయించాలని తపస్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కట్ట రాజేశ్వర్, అన్నమనేని తిరుపతిరావు కోరారు. బుధవారం అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌కు వినతిపత్రం అందించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



కరీంనగర్ కల్చరల్: జ్యోతినగర్ ఎస్సారార్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వల్లపు రెడ్డి వంశీకృష్ణ, ఉపాధ్యక్షుడిగా కోట దామోదర్ రెడ్డి, కార్యదర్శిగా సింగిరెడ్డి కమలాకర్ రెడ్డి, కోశాధికారిగా గోనె హనుమంతరావు, ఈసీ మెంబర్లుగా డాక్టర్ జయకృష్ణ, నాసని వెంకటేశ్వర్లు, కె.భాస్కరరావు, రాజేశం, సుబ్బారెడ్డి ఎన్నికయ్యారు.



కరీంనగర్: జెండా ఆవిష్కరిస్తున్న వెంకట్‌రెడ్డి, సీపీఐ నాయకులు



కమాన్ చౌరస్తాలో కార్మిక జెండా ఆవిష్కరిస్తున్న రవీందర్



చామనపల్లిలో వేడుకల్లో పాల్గొన్న నాయకులు

కార్మిక చట్టాలను మార్చే కుట్ర

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి
- జిల్లాలో ఘనంగా మే డే

కరీంనగర్: ప్రపంచవ్యాప్తంగా కార్మికుల హక్కులు, చట్టాలకు రక్షణగా ఉండేది ఎర్ర జెండానేనని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. దేశంలో కార్మిక చట్టాలను మార్చే కుట్ర చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని మార్చే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ఇందుకు యావత్ కార్మిక లోకం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 138వ మేడేను పురస్కరించుకొని బుధవారం తీగలగుట్టపల్లి రైల్వే గేటు వద్ద రైల్వే హమాలీ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

మే డే స్ఫూర్తితో కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, ప్రధాన కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మే డే నిర్వహించారు. సివిల్ సప్లయ్, ఉల్లిగడ్డల, ఫెర్టిలైజర్, ఐరన్ హార్డ్‌వేర్ హమాలీ సంఘాల జెండాలను ఆవిష్కరించారు. 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని, 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాల పునరుద్ధరణకు బీజేపీని ఓడించాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్, సీపీఐ నగర కార్యదర్శి సురేందర్ రెడ్డి, ఆర్టీసీ కూలీ సంఘం అధ్యక్షుడు పోశయ్య, నాయకులు, కార్మికులున్నారు.

ట్రాన్స్‌పోర్టు హమాలీల ఆధ్వర్యంలో..

మే డేను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని గాంధీరోడ్‌లో ట్రాన్స్‌పోర్టు హమాలీల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వేడుకలకు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి జెండా ఎగురవేశారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ అభివృద్ధి వందల ఏళ్లు వెనక్కి వెళ్లిందని ఆరోపించారు. కుల, మత విద్వేషాలు పెచ్చరిల్లాయని, మైనారిటీలు, దళితులపై దాడులు పెరిగాయన్నారు. విదేశాల్లో దాచిన నల్ల ధనాన్ని తీసుకువచ్చి, ప్రతీ భారతీయుడికి రూ.15 లక్షలు పంచుతానన్న మోదీ మాటలు మాయ మాటలుగా మిగిలిపోయాయని పేర్కొన్నారు.



కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట..

బీజేపీకి దిమ్మతిరిగే తీర్పు ఇస్తారు..

మే డే స్ఫూర్తితో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఉద్యోగులు, కార్మికులు దిమ్మ తిరిగే తీర్పు ఇస్తారని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గీట్ల ముకుందరెడ్డి, ఎడ్ల రమేశ్ అన్నారు. నగరంలోని వాడవాడనా సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. కేంద్రంలోని బీజేపీని ఓడించాలని ప్రతిజ్ఞ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లిస్తే తప్ప కార్మికులు బతకలేరని ఎన్నిసార్లు కేంద్ర ప్రభుత్వానికి మొర పెట్టుకున్నా వేతనాలు పెంచలేదన్నారు. ఫ్లోర్ లెవెల్ మినిమం వేజ్ రోజుకు రూ.178గా నిర్ణయించడం దారుణమని పేర్కొన్నారు. ఇండియా కూటమికి ఓటు వేయాలని పిలుపునిచ్చారు.



ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్–1104 నాయకులు..

టీయూసీసీ ఆధ్వర్యంలో...

మే డే సందర్భంగా ట్రేడ్ యూనియన్ కో–ఆర్డినేషన్ సెంటర్(టీయూసీసీ) అనుబంధ ప్రభుత్వ హాస్పిటల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ ఆస్పత్రిలో సంఘం గౌరవ అధ్యక్షులు బండారి శేఖర్ జెండా ఆవిష్కరించారు. పోరాడి సాధించుకున్న 8 గంటల పనిదినం, కార్మిక చట్టాలు, హక్కులను రక్షించుకోవాలన్నారు. కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సూచించారు. కార్యక్రమాల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, రైల్వే గూడ్స్ ట్రాన్స్‌పోర్టు హమాలీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కాశెట్టి లక్ష్మయ్య, కార్యదర్శి గాండ్ల రమేశ్, ఉపాధ్యక్షుడు దాసరి ప్రభాకర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, నలువాల సదానందం, బూడిద సదాశివ, ట్రాన్స్‌పోర్టు హమాలీ యూనియన్ అధ్యక్షుడు సాయవేణి రాయమల్లు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు యు.శ్రీనివాస్, గుడికందుల సత్యం, జనగాం రాజమల్లు, జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్, ఆలిండియా యూత్ లీగ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ప్రశాంత్ కుమార్, కె.బద్రినేత, ప్రభుత్వ ఆస్పత్రి సంఘం అధ్యక్షుడు అరుణ్ కుమార్ నాయకులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను సవరిస్తే ఉద్యమిస్తాం

కరీంనగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరిస్తే ఉద్యమిస్తామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం మే డే సందర్భంగా కరీంనగర్ మండలంలోని చామనపల్లిలో నిర్వహించిన వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఏఐటీయూసీ జెండాను ఎగురవేశారు. చామనపల్లిలో వెట్టిచాకిరీ, బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడిన చొక్కారావు ఆశయాలకు అనుగుణంగా ఉద్యమించాలని సూచించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, నియోజకవర్గ కార్యదర్శి కె.సురేందర్‌రెడ్డి, హమాలీ సంఘం నాయకులు ఎం.కొమురయ్య, రాములు తదితరులున్నారు.

దుర్శేడ్‌లో వేడుకలు..

దుర్శేడ్‌లో బుధవారం శివశక్తి తాపీ మేస్త్రీ సంఘం ఆధ్వర్యంలో మే డే నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు శనిగరం రాజు జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ తోట తిరుపతి, మాజీ ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, సంఘం ఉపాధ్యక్షుడు బెజ్జంకి శంకర్, కోశాధికారి సాయిల్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యానగర్: మే డే సందర్భంగా బుధవారం కరీంనగర్‌లోని కమాన్ చౌరస్తాలో తెలంగాణ యునైటెడ్ మోటార్ వైండింగ్ వర్కర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు దొంత రవీందర్ జెండా ఆవిష్కరించి, స్వీట్లు పంపిణీ చేశారు. ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంది కృష్ణారెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాయితోజు పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి తిప్పర్తి రత్నాకర్, ఉపాధ్యక్షులు దొంతమల్ల రవి, వీరేశం, గంగాధర్, వేణు, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

8 గంటల పని విధానం అమలు చేయాలి

కొత్తపల్లి: కార్మికులకు 8 గంటల పని విధానం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుంద రెడ్డి డిమాండ్ చేశారు. మే డే సందర్భంగా బుధవారం కొత్తపల్లి మండలం బావుపేటలోని జిల్లా గ్రానైట్ ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆఫీసు వద్ద కామ్రేడ్ రాజేశం పతాకావిష్కరణ చేశారు. గ్రానైట్ క్వారీల, ఫ్యాక్టరీల్లో పని చేస్తున్న కార్మికులకు నేటికీ 12 నుంచి 13 గంటల పని కొనసాగిస్తూ శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సుకాంత్, సుధాకర్ రెడ్డి, రఘు, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

1104 యూనియన్ కార్యాలయంలో..

కరీంనగర్‌లోని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్–1104 యూనియన్ జిల్లా కార్యాలయంలో బుధవారం మే డే నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆకుల వీరయ్య, రాష్ట్ర, కంపెనీ, జిల్లా, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలి

- టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ



మాట్లాడుతున్న పాపయ్య

కరీంనగర్: పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(టీఎమ్మార్పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్‌లోని సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఎలా ఓడించారో పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించాలని కోరారు. పార్లమెంట్ ఇన్‌చార్జి గజ్జెల లక్ష్మణ్ మాట్లాడుతూ.. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని మాదిగలంతా ఏకమై, వెలిచాల రాజేందర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. నాయకులు దీకొండ కుమారస్వామి, ఎలుకపెల్లి కుమార్, వెంకన్న, లచ్చయ్య, రవీందర్, జ్యోత్స్న, కోమల తదితరులు పాల్గొన్నారు.

బీసీల సమస్యలు పరిష్కరించేవారికే మద్దతు



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

కరీంనగర్: బీసీ సమస్యలు పరిష్కరించే అభ్యర్థికే పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతు ఇస్తామని బీసీ సంఘాల జేఏసీ నాయకులు తెలిపారు. బుధవారం కరీంనగర్‌లోని ఓ హోటల్లో రాచమల్ల రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేఏసీ సీనియర్ నాయకుడు కేశిపెద్ది శ్రీధర్‌రాజు మాట్లాడారు. దేశంలోని ఓబీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేసే అభ్యర్థికే మా మద్దతు ఉంటుందన్నారు. కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, మహిళా బిల్లులో బీసీ మహిళా కోటా స్పష్టంగా పొందుపరచాలని డిమాండ్ చేశారు. బీసీ కులగణన చేపట్టి, చట్టసభల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ల అమలుకు మద్దతు తెలుపుతామన్న అభ్యర్థి గెలుపునకే కృషి చేస్తామని పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగు అభినందనీయం

- ఆర్డీవో మహేశ్వర్
- కార్మికులకు మామిడి పండ్లు పంపిణీ చేసిన ఉత్తమ రైతు శ్రీహరి



ఆర్డీవో మహేశ్వర్‌తో శ్రీహరి తదితరులు

విద్యానగర్: సేంద్రియ వ్యవసాయం చేయడం అభినందనీయమని, ఈ విధానాన్ని రైతులందరికీ వివరించి, ప్రోత్సహించాలని ఆర్డీవో మహేశ్వర్ అన్నారు. సేంద్రియ సాగు చేస్తూ రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డు పొందిన బొప్పు శ్రీహరి మే డే సందర్భంగా బుధవారం భగత్‌నగర్ గోదాంగడ్డ వద్ద ఉన్న తన నివాసంలో వివిధ రంగాల కార్మికులకు మామిడి పండ్లను ఆర్డీవో చేతులమీదుగా పంపిణీ చేశారు. వాటిని తన వ్యవసాయ క్షేత్రంలోనే పండించినట్లు తెలిపారు. రసాయన ఎరువుల వాడకం వల్ల అనేక అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ఆరోగ్య సంరక్షణకు దోహదపడే సేంద్రియ పద్ధతులను రైతులకు వివరించాలని ఆర్డీవో సూచించారు. కార్యక్రమంలో శ్రీహరి కుమారులు వాసు, దేవేందర్, కార్పొరేటర్ బర్కత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

స్వీయ నియంత్రణతో విద్యుత్ ప్రమాదాలకు చెక్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఈ గంగాధర్, అధికారులు

కొత్తపల్లి: స్వీయ నియంత్రణతోనే విద్యుత్ ప్రమాదాలు నివారించవచ్చని టీఎస్ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. నాణ్యత లేని గృహోపకరణాలతో విలువైన ప్రాణా లు కోల్పోతున్నారన్నారు. బుధవారం నుంచి 7వ తేదీ వరకు కరీంనగర్ సర్కిల్‌లో నిర్వహిస్తున్న విద్యుత్ భద్రతా వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. గ్రామీణ విద్యుత్ వినియోగదారులు లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్, సీనియర్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇంజినీర్, సెక్షన్ ఆఫీసర్లను సంప్రదించి సేవలు పొందాలన్నారు. విద్యుత్ సంబంధిత సమస్యలు, ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబర్ 1800 425 0028 లేదా 1912కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈలు విజయేందర్‌రెడ్డి, రాజం, తిరుపతి, ఎస్ఏవో రాజేశం, లావణ్య, పీవో బండారి చంద్రయ్య, హబీబా, సురేష్‌కుమార్, శ్రీహరి, మునీందర్, చంద్రశేఖర్, పండరి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో నీటి సరఫరాకు తీర్మానం



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని దుర్శేడ్‌లో తాగునీటి సమస్యపై బుధవారం అధికారులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు గ్రామస్తులు ఆరోపించారు. ఇరుకుల్ల వాగులోని రక్షిత తాగునీటి బావులకు వెంటనే పైపులైన్ కనెక్షన్ ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. తాగునీటి సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని తీర్మానించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనూష, గ్రామ ప్రత్యేక అధికారి రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ తోట తిరుపతి, మాజీ చైర్మన్ కోరుకంటి వేణుమాధవరావు, మాజీ ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగం



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలో యాసంగి సీజన్‌కు సంబంధించి వరి, మొక్కజొన్న దిగుబడిని తెలుసుకునేందుకు వ్యవసాయాధికారులు బుధవారం పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఇరుకుల్ల గ్రామంలో రైతు బుర్ర శ్రీనివాస్ పొలంలో 25 చదరపు మీటర్ల నుంచి సేకరించిన 16.2 కిలోల ధాన్యాన్ని బట్టి ఎకరానికి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. దావు నారాయణ పొలంలో 23 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఏఈవో స్వర్ణలత తెలిపారు. చామనపల్లిలో మొక్కజొన్న పంటలో నిర్వహించిన ప్రయోగంలో ఎకరానికి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని తేలినట్లు మండల ప్లానింగ్ అండ్ స్టాటిస్టికల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

'నేను తప్పక ఓటు వేస్తాను' పోస్టర్ ఆవిష్కరణ



సప్తగిరికాలనీ: 'నేను తప్పక ఓటు వేస్తాను.. మీరు కూడా ఓటు వేయండి' అనే నినాదంతో స్థానిక వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్ బుధవారం ప్రిన్సిపాల్ సీహెచ్.శ్రీనివాస్ ఆవిష్కరించారు. మీ ఓటే ప్రశ్నించే గొంతు కావాలని, ప్రలోభాలకు లొంగకుండా ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ధనపురి సాగర్, మహేశ్, రామేశ్వర్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పది' ఫలితాల్లో 'ట్రినిటి' ప్రభంజనం



10 జీపీఏ సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న మనోహర్‌రెడ్డి తదితరులు

పెద్దపల్లిరూరల్: ట్రినిటి పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ప్రభంజనం సృష్టించారు. నూరుశాతం ఫలితాలు సాధించడంతోపాటు 29 మంది 10జీపీఏ సాధించి జిల్లాలో అగ్రస్థానంలో నిలిచారు. మరో 180 మంది 9.0 జీపీఏ కన్నా అధిక మార్కులు సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, విద్యాసంస్థల చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి అభినందించారు. ప్రిన్సిపాల్ రమేశ్, వైస్‌ప్రిన్సిపాల్ కుమారస్వామి ఉన్నారు.

గాయత్రీ విద్యార్థుల హవా...

పట్టణంలోని గాయత్రీ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు టెన్త్ ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. గడ్డం అభిరాం 9.8 జీపీఏ, సాక్షిత 9.7, వర్షిని 9.0 జీపీఏ సాధించారు. మంచిమార్కులు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజని, ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్, లింగేశ్వర్ తదితరులు అభినందించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఎల్ఎండీ పాఠశాల పూర్వ విద్యార్థులు



సుభాష్‌నగర్ ఉన్నత పాఠశాలలో..

కరీంనగర్: తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ పాఠశాలకు చెందిన 1985–86 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు బుధవారం కరీంనగర్‌లోని ఓ హోటల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఇంజినీర్లు, టీచర్లు, లెక్చరర్లు, వ్యాపారవేత్తలు.. ఇలా ఒక్కో రంగంలో స్థిరపడిన 50 మంది వచ్చారు. 38 ఏళ్లకు చిన్ననాటి మిత్రులను చూసి, భావోద్వేగానికి లోనయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. బడిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకుంటూ సందడిసందడిగా గడిపారు. కుంట రాజేందర్‌రెడ్డి, నరేశ్ కుమార్, ఎం.దయానంద్, నిమ్మల సుధాకర్, ఎం.క్రిస్టఫర్, వేణు, శ్రీధర్, శ్రీనివాస్‌రెడ్డి, లింగయ్య, కిష్టారెడ్డి, సదానందం, ముస్తాక్, శ్రీనివాస్, రవి, చారి, రమేశ్ తదితరులున్నారు.

సప్తగిరికాలనీ: కరీంనగర్ సుభాష్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1998–99 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఒక్కచోట చేరారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకుంటూ నవ్వుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు మల్లేశం, సూర్యప్రకాశ్, దత్తాత్రేయ, మాధవి, లత, లక్ష్మణమూర్తి, లక్ష్మణరేఖ, మంగాదేవి, శంకరయ్య తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో కుమార్, కృపారాణి, కుమారస్వామి, అన్నపూర్ణ, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.